
# కళ్లజోడు



**- సరస్వతుల రామనరసింహం**

**దేవీ నవరాత్రి ఉత్సవాలలో దేవీ భాగవతం పురాణ ప్రవచన కార్యక్రమం పెట్టారు కమిటీ వారు. పురాణం చెప్పే సుబ్బయ్య శాస్త్రి గారు సతీ సమేతంగా ఒక రోజు ముందు గానే వారి వూరి నుంచి వచ్చి, దేవాలయ సత్రంలో బస చేశారు.**

దేవాలయ మంటపంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన పురాణం సూర్యాస్తమయం సమయానికి ముందు ముగుస్తోంది. పట్టణాల్లో అయితే శాస్త్రి గారి ఉపన్యాసాలకు, పురాణ ప్రవచనాలకు వందల్లో భక్తులు వచ్చి వింటారు. కాని అది శుద్ధ పల్లెటూరు, జనం అట్టే రారని ముందుగానే నిర్వాహకులు వారికి విన్నవించుకున్నారు. నిరుత్సాహ పడలేదాయన. పురాణంతో బాటు, ఉప కథల్ని, తనకు తోచిన మంచి మాటల్ని జోడించి 'వినరంజకం'గా చెప్పసాగేరు.

ఆ రోజు ఆయన పురాణం ప్రారంభించే ముందు చూసుకుంటే కళ్ళజోడు లేదు. ''నా కళ్ళజోడు మరిచాచ్చాను. మళ్ళీ విడిదికి వెళ్లి రావాలంటే టైము పట్టేలా వుంది. మీలో ఎవరైనా కళ్లజోడివ్వండి'' అన్నారు ఎదురుగా కూర్చున్న వారి నుద్దేశించి. ఏడెనిమిది కళ్లజోళ్లు వచ్చేయి. ఒక్కొక్కటీ పెట్టుకు చూశారాయన. వాటిల్లో గంగాధరం గారి కళ్ళజోడు పవరు సూటయ్యింది. పురాణం ప్రారంభమైంది. రసవత్తరంగా సాగుతోంది.

అది ఆఖరి రోజు. పురాణం ముగించి, ఎంత రాత్రయినా వాళ్ల వూరు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నారు శాస్త్రిగారు. సూర్యాస్త మయం కావస్తోంది. వాచీ చూసుకున్నారు. మరో అరగంట చెప్పాల్సింది ఉండిపోయింది. మిగిలిపోయిన ఆ రెండు ముక్కల్నీ భార్యని చెప్పమని చెప్పి, తను సంధ్య వార్చుకోడానికి సమీపంలో ఉన్న చెరువు కెళ్లారు శాస్త్రిగారు. వారి వెనక సహాయకురాలిగా కూర్చుని అవసరమైనపుడు అందుకుని పురాణం చెప్పడం వారి ధర్మపత్నికి కొత్తేం కాదు.

శాస్త్రి గారు చెరువుకి వెళ్లి నీళ్లల్లో రెండు మెట్లు దిగేరు. ''అపవిత్రః పవిత్రోవ సర్వావస్థాం గతోపివ...'' అనుకుంటూ ముందుకు వంగి తల మీద నీళ్లు జల్లుకుంటూ వుంటే వదులుగా ఉన్న ఆ కళ్ళజోడు కాస్తా బుడుంగుమని నీళ్లల్లో పడిపోయింది!

ఆయన కంగారు పడిపోయారు. నీళ్లలో చెయ్యి పెట్టి హడావుడిగా వెదికేరు. మరో మెట్టు కిందకి దిగి, కాళ్లతోనూ చేతులతోనూ దేవులాడినా దొరకలేదు. కంగారెక్కువ కాసాగింది. ఆ కళ్లజోడు తనది కూడా కాదాయె. మళ్ళీ వెదికేరు. ఇంకా లోతుకు వెడితే మెట్లు అయిపోయి, బురద చేతికి తగులుతోంది. లాభం లేదు, బురదలో కూరుకుపోయివుంటుంది అనుకున్నారాయన. ప్రాణం ఉసూరుమంది. ఆయనకేం చెప్పుకోవాలి? అనుకుంటూ, అన్యమనస్కంగానే సంధ్య వార్చి గట్టెక్కేరాయన.

దేవాలయానికి చేరుకునేసరికి శాస్త్రి గారి భార్య పురాణం పూర్తి చేయడం, భక్తులందరూ ఆమెకు నమస్కారాలు చెయ్యడం జరుగుతోంది. శాస్త్రి గారు రాగానే వారందరూ పాదాభివందనాలు చేసి, తోచిన విధంగా తాంబూలాల్లో దక్షిణలు పెట్టి సమర్పించుకున్నారు.

'ఎలా చెప్పాలా' అని తటపటాయిస్తూ గంగాధరం గారిని పక్కకి పిలిచి కళ్లజోడు పోయిన సంగతి నీళ్లు నవుల్తూ చెప్పేరు శాస్త్రి గారు విచారవదనంతో. ''అంతే కదా, కృష్ణార్పణం అనుకుంటాను'' అన్నారు


ప్రియమైన సభ్యులకు, మార్కెటింగ్ సిబ్బందికి,
ఆఫీస్ సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు



DTCP APPROVED LAYOUT
Classic
Dolphin Resorts
Kotyada Village, Araku Road, Near L.Kota
Each plot 240 Sq.yds
Project highlights
• Compound Wall • Open Air Theatre
• Club House • Cottages • Swimmingpool
బుకింగ్స్ జరుగుచున్నవి
✆ 99 08 33 99 00, 95 500 500 66



An ISO 9001:2008 Certified Company
GARIKIPATI INFRASTRUCTURES
3rd Floor, Krishna Enclave, Dwaraka Nagar, VISAKHAPATNAM-16.
Ph : 0891-2782957, www.garikipatiinfra.com
Regd. Office : Aditya Trade Center, Ameerpet, HYDERABAD.

గంగాధరం గారు తేలిగ్గా తీసుకుని.

అప్పటికే నిర్వాహకులు రెండెడ్ల బండి ఏర్పాటు చేశారు బస్సు వరకూ శాస్త్రి గారిని దింపి రావడానికి. విడిది నుంచి సామాను తెప్పించుకుని బయల్దేరడానికి సిద్ధమయ్యారాయన. పురాణంవిన్న భక్తులందరూ వచ్చేరు శాస్త్రి గారి దంపతులకు వీడ్కోలు చెప్పడానికి. శాస్త్రి గారి మనసు ఇంకా కుదుట పడలేదు. వచ్చిన వాళ్ళల్లో గంగాధరం గారిని వెదికి, ఆయన్ని పక్కకి పిలిచి చేతిలో రెండు వందల రూపాయలు పెట్టి నమస్కారం చేశారు.

గంగాధరం గారు ససేమిరా అన్నారు. ''దానికి పోయే యోగం వచ్చింది, పోయింది. ఆ సమయం వస్తే నా దగ్గరున్నా పోయేదే. కృష్ణార్పణం అనుకున్నాను. ఇక దాన్ని గురించి బాధ పడకండి'' అన్నారాయన. శాస్త్రి గారు వినలేదు. ''ఇది మీ కళ్లజోడు ఖరీదు కాదు. నష్టపరిహారం మాత్రమే. మీరు తీసుకునే దాకా నాకు మనశ్శాంతి లేదు'' అంటూ, వారి చేతిలో ఆ రెండు వందలూ కుక్కి బండెక్కేశారు. వారిద్దరి సహృదయాలకు వచ్చిన వారందరూ 'ఔరా' అనుకున్నారు.

***

అయితే మర్నాడు నీళ్లు తెచ్చుకోడానికి చెరువుకి వెళ్లిన ఆడవాళ్లలో ఒకరి కాళ్లకి కళ్లజోడు తగిలింది.

అది కుగ్రామం కావడం చేత ప్రతి విషయం అక్కడ బహిరంగ రహస్యమే. ఫలానా శాస్త్రి గారట ఫలానా కళ్లజోడు తీసుకుంటే అది కాస్తా నీళ్లలో పడి పోయిందట అని అంతకు ముందు రోజే అందరి నోళ్లలో పడి ఉండటం చేత, ఆ కళ్లజోడు గంగాధరం గారిదని తెలుసుకున్న ఆ స్త్రీ దాన్ని తెచ్చి ఆయన చేతికిచ్చింది. 'విధి లీల' అనుకున్నారు గంగాధరం గారు దాన్ని ఖండువాతో తుడుచుకుంటూ.

కథ ఇక్కడితో ఆగిపోలేదు. తర్వాతి సంవత్సరం దేవీ నవరాత్రులకు కూడా అదే శాస్త్రి గారిని పురాణం చెప్పడానికి మళ్లీ ఆహ్వానించారు ఆలయ కమిటీ వారు. సుబ్బయ్య శాస్త్రి గారు మళ్లీ విచ్చేశారు సతీసమేతంగా.

కొందరికి ప్రపంచంలో జరిగే విషయాలు మామూలుగా సాదాసీదాగా జరిగిపోవడం ఇష్టం వుండదు. ఏదో కాస్త భిన్నంగా, తమాషాగా ఉంటే బాగుంటుంది అని ప్రగాఢంగా నమ్మే వాళ్లలో ఒకాయన పని గట్టుకు వెళ్లి, శాస్త్రి గారిని పలకరించి, ''తమరు వెళ్లిన మర్నాడే ఆ కళ్లజోడు దొరికిందండి. అది గంగాధరం గారికి చేరిపోయింది కూడా'' అంటూ ఆ వైనం అంతా వివరణాత్మకంగా వారి చెవిన వేసి లేచ్చక్కావచ్చాడు.

సుబ్బయ్య శాస్త్రి గారి మనస్సనే చెరువులో బెడ్డ పడ్డది. అది శాంతి లేకుండా అలలు సృష్టించింది. మొదటి రోజు పురాణం చెప్పేవేళ భక్తుల్లో గంగాధరం కనిపిస్తారేమోనని వెదికేయి ఆయన కళ్లు. పురాణం అయ్యాక దర్శనం ఇచ్చారాయన.

''నమస్కారం. బావున్నారా?'' అని వూరుకున్నారు శాస్త్రి గారు, ఆయన తనంతట తానే కళ్లజోడు ప్రస్తావన తెస్తాడేమోనని.

''ఆ.... ఏదో ఇలా వున్నాం'' అన్నారు గంగాధరం గారు మరేం మాట్లాడకుండా.

''కళ్లజోడు దొరికిందటగా?'' అన్నారు శాస్త్రి గారు చివరికి తెగించి. ''అవునండి'' అని ఊరుకున్నారు గంగాధరం గారు. ఆలస్యం చేస్తే ఆయన ఎక్కడ జారుకుంటాడోనని, ''మీ వస్తువు మీకు దొరికింది కాబట్టి నేనిచ్చిన ఆ రెండు వందలూ ఇప్పించేస్తే...'' వాక్యం పూర్తి చెయ్యలేదు శాస్త్రి గారు.

''క్షమించాలి. నేనిచ్చుకోలేను'' అన్నారు గంగాధరం గారు. శాస్త్రి గారు మొహం చిట్లించడం చూసి, గంగాధరం గారే మళ్లీ అన్నారు ''నేను ఆనాడు స్పష్టంగా చెప్పాను, పోయే యోగం వుంటే ఆ కళ్లజోడు నా దగ్గరున్నా పోయేది అని. అయినా మీరు వినలేదు. డబ్బివ్వమని నేనేం అడగలేదే. అడగకుండానే చేతిలో పెట్టి, ఇప్పుడొచ్చి నన్నివ్వమంటే నేనెక్కడిస్తాను? అశక్తుణ్ణి!''

''ఓహో అలాగా? డబ్బు ఇవ్వలేకపోతే, నా కళ్లజోడు నాకిచ్చెయ్యండి'' అన్నారు శాస్త్రి గారు చిన్న పిల్లాడిలా.

గంగాధరం గారు చిన్నగా నవ్వేరు. ''ఎందుకివ్వాలి? మీరిచ్చింది నష్టపరిహారమే గాని, కళ్లజోడు వెల కాదు కదా? వెల చెల్లించనపుడు అది మీదెందుకవుతుంది? మీది కాని కళ్లజోడును మీకెలా ఇస్తాను?'' అన్నారు గంగాధరం గారు.

శాస్త్రి గారు అవాక్కయ్యారు. ''పోతే పోయింది లెండి, లాజిక్కు తెలిసింది'' అంది శాస్త్రి గారి భార్య, భర్తని వెనక్కి లాగుతూ.

★

*రచయిత సెల్ : 94405 42950*

